లేబర్ కోడ్ చట్టాలతో తీరని నష్టం

బొబ్బిలి: కార్మిక లోకం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను రద్దు చేసి కేవలం నాలుగు లేబర్ కోడ్ చట్టాలను తీసుకురావడం అన్యాయమని యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు అన్నారు. శనివారం పట్టణంలోని చర్చి సెంటర్ వద్ద జీపు జాతా నిర్వహించారు. ఈ జాతాను మోటార్ బైక్ ర్యాలీతో ప్రారంభించారు. లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20న జరుపతల పెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ఎం.గోపాలం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్, అంగన్‌వాడీల సంఘ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, పి.లక్ష్మణరావు, మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


రామభద్రపురం: జీపు జాతాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేష్

రామభద్రపురంలో...

రామభద్రపురం: లేబర్ కోడ్ చట్టాలతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.సురేష్ అన్నారు. లేబర్ కోడ్ చట్టాలకు వ్యతిరేకంగా ఈ నెల 20వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి శనివారం జీపుజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులపై దాడి చేస్తుందని విమర్శించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ చట్టాలను అమలు చేయడం దుర్మార్గమన్నారు. లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేసి, పాత చట్టాలను అమలు చేయాలని డిమాండు చేశారు. దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాలకు చెందిన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న రామ్మూర్తినాయుడు

సమ్మెను జయప్రదం చేయండి

రాజాం సిటీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న చేపట్టనున్న సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని ఆ సంఘం నేత సీహెచ్. రామ్మూర్తి నాయుడు పిలుపునిచ్చారు. సమ్మెకు సమాయత్తం చేసేందుకు చేపట్టిన బైక్ ర్యాలీని పట్టణంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ముకాసేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని అన్నారు. వీటిని రద్దు చేయడంతో పాటు కనీస వేతనం రూ.26వేలు చేయాలని కోరుతూ దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, ఆర్పీలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులను రెగ్యులర్ చేయాలని, గ్రీన్ అంబాసిడర్లకు రూ.10 వేల వేతనం అందించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి రెగ్యులర్ చేయాలన్న డిమాండ్లతో సమ్మె చేయనున్నట్లు చెప్పారు. కార్మిక సంఘం నాయకులు అనీల్‌కుమార్, గురువులు, వైకుంఠరావు, లక్ష్మి, బాలరాజు, కనకరాజు, గిరిబాబు, గోపి, సింహాచలం పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరామర్శ


ఉమామహేశ్వరరావుతో మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రేగిడి: రాజాం ఏఎంసీ మాజీ డైరెక్టర్ మీసాల అలివేలు అనారోగ్యంతో బాధపడుతున్నారు. రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శనివారం లచ్చన్నవలసకు వెళ్లి అలివేలు, ఆమె భర్త ఉమామహేశ్వరరావును పరామర్శించారు.అలివేలు వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్‌మోహనరావు,తదితరులు ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి


అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

బొబ్బిలి: మద్యపానం వలన అనర్థాలు, శారీరక, మానసిక రుగ్మతలు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఎస్‌ఐ బి.రాముడు అన్నారు. శనివారం స్థానిక మేదరిబంద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద కళాసీలు, కార్మికులకు అవగాహన కల్పించారు. కేర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు


వాహన చోదకుడిని బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శంకర్

వంగర: మద్యం తాగి వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ షేక్ శంకర్ హెచ్చరించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో శనివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. హెచ్‌సీ పిల్ల సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

అమర వీరునికి నివాళులు


మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం


బొబ్బిలి: ఆపరేషన్ సిందూర్‌లో అసువులు బాసిన తెలుగు బిడ్డ మురళీ నాయక్ అమర వీరుడని, అతని త్యాగం, రుణం దేశం తీర్చుకోలేనిదని రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ సంస్థల అధ్యక్షులు సిందిరి శ్రీనివాసన్, జేసీ రాజు అన్నారు. స్థానిక కళింగ వైశ్య భవనంలో అగ్నివీరుడు మురళీ నాయక్‌కు శనివారం ఘన నివాళులర్పించారు. కొవ్వొత్తుల వెలుగులతో ఆత్మ శాంతించాలని కోరారు. కె.రామకృష్ణ, కృష్ణమోహన్, ప్రసాద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

తాగునీటి కుళాయిల ప్రారంభం


సంకిలి ఎస్సీ కాలనీలో కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్ పట్టాభి

రేగిడి: సంకిలి గ్రామంలోని ఎస్సీ కాలనీ, యాదవవీధిలో ఇంటింట తాగునీటి కుళాయిలను సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ నిధులతో ఎస్సీ కాలనీ, యాదవవీధిలో 63 కుళాయిలను ఏర్పాటు చేశామని సర్పంచ్ తెలిపారు.

మొగిలివలస కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం


సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మండలంలోని అంతకాపల్లి పంచాయతీ మొగిలివలస గ్రామ సమీపంలోని కాలనీలో శనివారం సీసీ రోడ్డు నిర్మించారు. సర్పంచ్ వాకముళ్ల చిన్నంనాయుడు మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ. 5 లక్షలు, పంచాయతీ నిధులు రూ. 5లక్షలతో ఈ రోడ్డు నిర్మించామని తెలిపారు.

ఆస్పత్రికి రోగుల తాకిడి



బాడంగి సీహెచ్‌సీలో శనివారం రోగుల తాకిడి ఎక్కువగా కనిపించింది. వేసవి ఎండలు మండిపోతుండడంతో జ్వరాలతాకిడి ఎక్కువగా ఉంది. రోగుల తాకిడితో ఇన్‌పేషంట్ వార్డులో మంచాలన్నీ నిండిపోగా వరండాలో కూడా మంచాలను వేసి రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలో వైద్య సేవలు బాగానే అందుతున్నా మౌలిక సదుపాయల కొరతతో రోగులు ఇబ్బందుతు పడుతున్నారు. ఆస్పత్రిలో ఒకే గదిలో ముగ్గురు వైద్యులు ఓపీ సేవలు చూస్తున్నారు. కొన్నిసార్లు ఆరు బయట మెయిన్ హాల్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. 50 పడకల నూతన భవనం అందుబాటులోకి తీసుకువస్తే రోగుల సమస్యలు తీరుతాయని పలువురు పేర్కొంటున్నారు.

\- బాడంగి

వేడుకగా స్వామివారి తిరుక్కల్యాణం



బాడంగిలోని ఉమా సోమేశ్వరాలయంలో మూడు రోజులపాటు కన్నుల పండువగా జరిగిన స్వామి వారి తిరుక్కల్యాణ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. అర్చకులు సాయిరవితేజ శర్మ, సాయిచైతన్య మంత్రోచ్ఛరణాల నడుమ కల్యాణోత్సవం సాగింది.

\- బాడంగి

మహిళా వైద్య శిబిరం విజయవంతం

బొబ్బిలి: పట్టణంలోని కళింగ వైశ్య భవనంలో మహిళలకు సంక్రమించే ఆవకాశాలున్న వ్యాధుల నివారణ, చికిత్సలపై రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైందని చైర్మన్ జేసీ రాజు, అధ్యక్షుడు సిందిరి శ్రీనివాసన్ తెలిపారు ఆ వివరాలను విలేకర్లకు తెలిపారు. శిబిరానికి 98 మంది మహిళలు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వీరికి వైద్యులు పి.రామ్‌కుమార్, శ్రావణి క్యాన్సర్ స్క్రీనింగ్, మెమోగ్రాఫ్, పాప్‌స్మియర్ పరీక్షలు నిర్వహించారు. సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ వి.శృతి పలు సందేహాలను నివృత్తి చేశారు. డాక్టర్లు రోహిత్, డాక్టర్ ఆన్‌అగస్టీనా కౌన్సెలింగ్ ఇచ్చారు. రోటరీ ఫౌండేషన్ చైర్మన్ గెంబలి శ్రీనివాసరావు ఉచిత సేవలందించిన వైద్యులందరికీ సత్కార కార్యక్రమం నిర్వహించారు.


మహిళా వైద్య శిబిరం

గర్భిణులకు సత్కారం


గర్భిణులతో నిర్వాహకులు

బొబ్బిలి: మాతృ దినోత్సవం సందర్భంగా శనివారం సాయంత్రం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో మాతృ దినోత్సవం నిర్వహించారు. బొబ్బిలి ఇన్‌చార్జి రాజేశ్వరి అక్కయ్య చేతుల మీదుగా కాబోయే మాతృమూర్తులకు దుశ్శాలువలు, రవిక, గాజులు, పూలు, స్వీట్ బాక్సులతో సత్కరించి మాతృత్వ గొప్పతనం వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో జె.విజయలక్ష్మి పాల్గొని మాతృత్వానికి దగ్గరగా ఉన్న మహిళలంతా తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలపై వివరాలందజేశారు. మెడిటేషన్‌తో ప్రశాంతమయిన మాతృత్వాన్ని పొందే అవకాశాలను రాజేశ్వరి వివరించారు.

మత్తుపదార్థాలతో జీవితాలు నాశనం


పోరాం గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఉపేంద్ర

రేగిడి: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర సూచించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై పోరాం గ్రామంలో యువకులు, గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యంతో పాటు బెట్టింగ్‌లు, జూదం వంటి వాటి జోలికి వెళ్లవద్దని చెప్పారు. చెడు వ్యసనాలతో ఆరోగ్యంతో పాటు జీవితాలు ఛిద్రమవుతాయని అన్నారు.

తగ్గిన టికెట్ ధర

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రం నుంచి ధర్మవరం మీదుగా ఎస్.కోట వెళ్లే రూట్‌లో టిక్కెట్ ధర తగ్గిస్తున్నామని ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి సీహెచ్.అప్పలనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రూట్‌లో ఇంతవరకు తొమ్మిది స్టేజీలుండగా.. వాటిని ఎనిమిదికి తగ్గించి రూ.55 ఉన్న టికెట్ ధరను రూ. 50 చేశామన్నారు. ప్రయాణికులు గమనించాలన్నారు.

ప్రోటోకాల్ పాటించరా..!

రామభద్రపురం: కూటమి ప్రభుత్వంలో అధికారులు ప్రోటోకాల్ పాటించరా? అని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, మిర్తివలస గ్రామ సర్పంచ్ మజ్జి రాంబాబు ప్రశ్నించారు. మండలంలోని కొట్టక్కి రెవెన్యూ, మిర్తివలస పంచాయతీ మధుర గ్రామం కాకర్లవలస ప్రాంతంలో ఎంఎస్‌ఎంఈ పార్కుకు శనివారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. అయితే ఆ శంకుస్థాపనకు మిర్తివలస గ్రామ సర్పంచ్‌కు ఆహ్వానం లేకపోవడంతో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచ్‌కు కనీసం ఆహ్వానం లేకుండా ఎంఎస్‌ఎంఈ పార్కుకు శంకుస్థాపన చేయడం ఎంత వరకు సమంజసమని అధికారులపై మండిపడ్డారు. ఇది స్థానిక సర్పంచ్‌నైన తనను, గ్రామ ప్రజలను అగౌరవపరచడమేనని మండిపడ్డారు. ఇది పార్టీ కార్యక్రమంగా చేయడం భావ్యం కాదని పంచాయతీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. ప్రోటోకాల్ అమలుపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.


మాట్లాడుతున్న జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మజ్జి రాంబాబు

వడదెబ్బతో వ్యక్తి మృతి

బొబ్బిలి: వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఆకుల రెల్లివీధికి చెందిన సొండి కొండలరావు(60) కాలుకు శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ఏరియాలో గత నెల రోజులుగా భిక్షాటన చేస్తున్నాడు. శనివారం కూడా అదేపనిలో ఉంటూ ఎండలో అక్కడిక్కడే తిరుగుతూ పడిపోయాడు. స్థానికులను నీళ్ల కోసం అభ్యర్థించాడు. కొందరు తాగునీరు అందించడంతో తాగి వెంటనే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.


మృతి చెందిన కొండలరావు

ఇటుకకు తగ్గిన డిమాండ్

రేగిడి: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా గృహాలు మంజూరు చేయకపోవడంతో పాటు ఎక్కడా కొత్తగా ప్రభుత్వ భవన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో ఇటుకకు డిమాండ్ బాగా తగ్గిందని తయారీ దారులు అంటున్నారు. మండలంలోని చిన్నశిర్లాం, లచ్చన్న వలస, లచ్చారాయపురం తదితర గ్రామాల్లో ఎక్కువగా ఇటుక బట్టీలు నిర్వహిస్తుంటారు. మండలంలో పదుల సంఖ్యలో కుటుంబాలు ఇటుక తయారీని వృత్తిగా ఎంచుకుని జీవనం సాగిస్తున్నాయి. గత కొంత కాలంగా ఇటుక అమ్ముడుకావడం లేదని, తమ జీవనాధారం కోల్పోతున్నామని ఇటుక తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


లచ్చారాయపురంలో ఇటుక తయారు చేస్తున్న కార్మికుడు

భూసార పరీక్షలతో ప్రయోజనం

రేగిడి: భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఏఓ జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని గుళ్లపాడు, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లోని పంటపొలాల్లో శనివారం మట్టి నమూనాలు సేకరించారు. మట్టి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేస్తామని, వచ్చిన రిపోర్టు ఆధారంగా ఆ పొలంలో ఏయే పంటలు సాగుచేయవచ్చో, పంటకు ఏయే ఎరువులు వేయాలన్నది రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. వీఏఏ కెంబూరు శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీ పైల తవిటినాయుడు పాల్గొన్నారు.


ఉప్పర్నాయుడువలసలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రేపటి నుంచి పైడితల్లి పండగ

- సుమారు 120 ఏళ్ల తర్వాత వేడుకలు
- అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు

డెంకాడ: గ్రామాల్లో గ్రామ దేవత పండుగలను సాధారణంగా మూడు, ఐదు సంవత్సరాలకు.. లేదంటే పది, ఇరవై సంవత్సరాలకు ఒకసారైనా చేస్తుంటారు. కాని మండలంలోని అక్కివరం గ్రామంలో పైడితల్లి పండుగ సుమారు 120 సంవత్సరాల తర్వాత చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో జరిగిన పండుగను చూసిన ఒక్కరు కూడా గ్రామంలో లేరంటే పండుగ ఎప్పుడు చేసి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. అయితే పండుగను మాత్రం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి సిరిమాను చెట్టును సేకరించి సిరిమానుగా మలుస్తున్న పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 12న తొలేళ్లు, 13న సిరిమానోత్సవం, 14న కనుమ పండుగ నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.


పైడితల్లి

నిత్యావసర సరుకుల పంపిణీ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి పొనుగుటివలస గ్రామంలో శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు అదే గ్రామానికి చెందిన రెండు దత్తత కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను శనివారం అందజేశారు.పేద కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు ప్రతీ నెల సరుకులు అందజేస్తున్నామని యువకులు గార సత్యనారాయణ, రెడ్డి శ్రీనివాసరావు, శాసపు ఉమామహేశ్వరరావు, గాడెపల్లి గోవిందరావు తెలిపారు.


దత్తత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న యువకులు

డీఎస్సీ అభ్యర్థులకు యూటీఎఫ్ శిక్షణ


పుస్తకాలతో డీఎస్సీ అభ్యర్థులు, నిర్వాహకులు

బొబ్బిలి: డీఎస్సీ రాస్తున్న అభ్యర్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కాలేజీలో కొన్ని అంశాలపై శిక్షణ ఇచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి ఆధ్వర్యంలో రీసోర్స్‌పర్సన్లు మండల రమేష్, రామకృష్ణ, బి.శంకరరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రాసిన మనో విజ్ఞానశాస్త్రం పుస్తకాలను ఉచితంగా అందజేశారు. కరస్పాండెంట్ రౌతు వాసుదేవరావు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వేసవి పంటలు


కొప్పర గ్రామంలో పెసర, నువ్వు పంట సాగు

వంగర: మండలంలో వేసవి పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఈఏడాది వర్షాలు అనుకూలించడంతో కొప్పర, కొండచాక రాపల్లి, కె.కొత్తవలస, బంగారువలస, ఇరువాడ, మరువాడ తదితర గ్రామాల్లో నువ్వులు, పెసర, కూరగాయలు, ఆకుకూరల పంటలను రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం నువ్వులు, పెసర పంటలు పూత దశలో ఉన్నాయి.